క్లుప్తంగా

రూ.1.50 కోట్లు మంజూరు



కమలాపూర్: విభజన హామీల్లో భాగంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్‌కు రూ.1.50 కోట్లు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తొటం ఝాన్సీరవీందర్ తెలిపారు. కమలాపూర్ ఏఎంసీ నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత వ్యవసాయ మార్కెట్ విభజన హామీల నిధులు ఇప్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితెల ప్రణవ్‌ను అభ్యర్థించగా.. ఆయన చొరవతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో మాట్లాడి రూ.1.50 కోట్ల నిధులు విడుదల చేయించినట్లు తెలిపారు. ఈమేరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్నసదానందం శుక్రవారం రూ.1.50 కోట్ల చెక్కు అందజేసినట్లు తెలిపారు. విభజన హామీల నిధులు ఇప్పించిన ఒడితెల ప్రణవ్‌కు ఏఎంసీ చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేశిని అయిలయ్య గౌడ్, డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, జనగాని శివకృష్ణగౌడ్, భిక్షపతి, మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.

18న చలో రైల్‌నిలయం

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో రైల్ నిలయం కార్యక్రమం చేపట్టినట్లు శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ తెలిపారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్ల నుంచి సుమారు 1000 మంది రైల్వే కార్మికులు తరలిరానున్నట్లు తెలిపారు. మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్, డివిజన్, కాజీపేట సబ్ డివిజన్ పరిధి బ్రాంచీల నాయకులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

నల్లగొండకు తరలిన టీచర్లు

విద్యారణ్యపురి: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తున్నారు. శుక్రవారం ఆయన నల్గొండలో నామినేషన్ వేస్తుండటంతో హనుమకొండ, వరంగల్ జిల్లాకేంద్రాల నుంచి టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు బస్సులో తరలివెళ్లారు. తరలిన వారిలో టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, గొడిశాల సత్యనారాయణ, లక్ష్మయ్య, శ్రీ రామ్, సిహెచ్.రవీందర్‌రాజు, పెండెం రాజు, కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు అజ్మీరా రాజారాం తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

నయీంనగర్ : ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ జనసమితి నల్గొండ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత హెడ్‌మాస్టర్ పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాల సముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గెలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు ఉపాధ్యాయుల సమస్యలను గాలికి వదిలేసారని తాను గెలిస్తే వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్ యాదవ్, కట్ల జగన్నాథం గౌడ్, పెద్దయ్య, సుధాకర్, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే వరల్డ్ రికార్డు ప్రాజెక్టుకు ఉద్యోగి ఎంపిక

కాజీపేట రూరల్ : కా జీపేట రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచే స్తున్న, కరాటే బ్లాక్ బెల్టు ఫిఫ్త్ డాన్ పి.దేవయ్య చెన్నైలో నేడు (శనివారం) జ రిగే వరల్డ్ కరాటే మా స్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే వరల్డ్ రికార్డు–2025 ప్రాజెక్ట్‌కు ఎంపికయ్యాడు. 10 వేల మంది పాల్గొంటున్న వరల్డ్ రికార్డు ప్రాజెక్ట్‌కు తాను ఎంపికై పాల్గొంటున్నందుకు సంతో షంగా ఉందని శుక్రవారం దేవయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పలు సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. నూతనంగా రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సి పాల్ చాంబర్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, సైన్స్ వి భాగాల అధిపతులు తమతమ వివిధ విభాగాల్లోని పలు సమస్యలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. డిపార్ట్‌మెంట్ కమిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా చేర్చాలని కోరారు. ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి కళాశాలలో విద్యాబోధన, అలాగే ఉద్యోగుల కొరత తదితర అంశాలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంబీఏ కళాశాల ప్రాంగణంలో రామచంద్రం, ప్రిన్సిపాల్ జ్యోతితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సన్మానించారు.

మిర్చి రైతుల దిగాలు



తోటలో మిర్చి ఏరుతున్న కూలీలు



ఆరబోసిన మిర్చి

- పడిపోయిన ధర
- నల్లి తెగులుతో పెరిగిన పెట్టుబడి
- లబోదిబోమంటున్న రైతులు
- మండలంలో 2400 ఎకరాల్లో సాగు

నడికూడ : ఆరుగాలం కష్టపడి మిర్చి సాగు చేసిన రైతులు దిగాలు చెందుతున్నారు. ఉన్నపళంగా ధర పడిపోవడతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అయితే ధర పెరుగుతోందనని విక్రయించకుండా వేసి చూస్తున్నారు.

మండలంలో 2400 ఎకరాల్లో సాగు

మండల పరిధిలో సుమారు 2400 ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో గత ఏడాది కంటే తక్కువ ధర పలుకుతుండడం, ఓ వైపు పెట్టుబడి భారం, పంటలో వచ్చే తెగుళ్ల భయం రైతులను అయోమయానికి గురిచేస్తుంది. విత్తనం, పురుగుల మందుల రేట్లు పెరగడం, కూలీల డిమాండ్ కారణంగా ఎకరా మిర్చి సాగుకు రూ లక్ష నుంచి రెండు లక్షల పెట్టుబడి అవుతున్నట్లు సదరు రైతులు తెలిపారు. అయితే దిగుబడి 20 నుంచి 22 క్వింటాళ్లే వస్తుందని ఆందోళన వ్యక్తం చేసున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ తగ్గడంతో రేటు భారీగా పతనమైందని మార్కెట్ వర్గాలు చెబుతుండడంతో పంటను విక్రయించకుండా రైతులు వేచి చూస్తున్నారు. వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్తే అక్కడ వ్యాపారులు జెండా పాటగా ధర రూ.13 వేలు ఉండగా క్వింటాకు రూ.8 నుంచి రూ.9.వేలుకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ధరకు విక్రయిస్తే పెట్టుబడి, కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని దిగాలు చెందుతున్నారు. గత ఏడాది తాలుపంటకు మార్కెట్‌లో పలికిన ధర సైతం ఈ ఏడాది నాణ్యమైన పంటకు దక్కడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మిర్చి రైతులపై ప్రభుత్వం దృష్టిసారించి ఆదుకోవాలని కోరుతున్నారు.



తెగుళ్లను చూపుతున్న రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



గతేడాది కంటే మిర్చికి తక్కువ ధర పలకడంతో పెట్టిన పెట్టుబడి, కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కూలీల కొరత ఏర్పడడంతో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఇతర మండలం నుంచి కూలీలను తీసుకురావడంతో కూలీలకు ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. దీంతో ఈ ఏడాది పెట్టిబడి పెరిగింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- ఊర సతీశ్‌రావు, నడికూడ

అప్పులపాలయ్యేలా ఉన్నాం



గతేడాది తాలు మిర్చికి పలికిన ధర ఈ ఏడాది నాణ్యమైన పంటకు పలకడం లేదు. ఈసారి వాతావరణంలో మార్పులు వలన కావచ్చు నల్లి తెగులు మిర్చి పంటకు సోకింది. దాని నివారణకు ఎరువులు, రసాయన మందులను పిచికారి చేయడంతో ఎకరాకు లక్ష నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టినం. ఇందులో సగమైనా వస్తుందో లేదో దిగులుగా వుంది.

\- వరికెల కిషన్‌రావు, నర్సక్కపల్లి

మోడల్ స్కూల్ విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర



చారిత్రక రామప్ప దేవాలయం వద్ద మోడల్ స్కూల్ విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పీఎంశ్రీ పథకంలో భాగంగా విజ్ఞాన, విహారయాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి గురించి తెలుసుకున్నారు. అనంతరం యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని, మేడారంలోని గిరిజన మ్యూజియాన్ని సందర్శించి వాటి విశిష్టత, చారిత్రక నేపథ్యం తెలుసుకున్నారు. గిరిజన దేవతలైన సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు విద్య ద్వారానే కాకుండా ఇలాంటి క్షేత్ర పర్యటనలు, విజ్ఞాన, విహారయాత్రల ద్వారా మరింత జ్ఞాన సముపార్జన పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స కోసం తెచ్చిన అప్పు తీర్చలేక..

- ఉరేసుకుని వ్యక్తి బలవర్మరణం



వేలేరు : భార్యకు అనారోగ్యం వెంటాడడంతో చికిత్స కోసం భర్త కొంత డబ్బు అప్పు తెచ్చాడు. ఈ క్రమంలో తెచ్చిన అప్పును ఎలా తీర్చాలనే మనస్థాపం చెందిన అతడు ఇంటి ఎదుట గల వేపచెట్టుకు ఉరేసుకుని బలవర్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నూనావత్ హరిలాల్ (59) కూలీ పని చేస్తు కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాడు. కొంతకాలంగా ఆయన భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స కోసం అప్పు తెచ్చాడు. ఈ క్రమంలో తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది ఇంటిముందు ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి పరామర్శ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా తల్లి మణెమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మణెమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ కెడం లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఆత్మకూరు : కొత్తగట్టు గ్రామానికి చెందిన కంప సాంబయ్య జాతీయ రహదారి పక్కన హోటల్ పేరుతో గుట్కా విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. ఈ దాడుల్లో రూ.2,780 విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని సాంబయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


సంక్షిప్తంగా

ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



కమలాపూర్ : మండలంలోని గుండేడులో ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ సుమారు రూ.3 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి దాత నాగపురి రాజుగౌడ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు లాండిగె లక్ష్మణ్‌రావు, చికిలె లక్ష్మణ్‌రావు, ఉపాసి తిరుపతిరావు, నాయకులు మేకల రవి, నాంపెల్లి ప్రభాకర్, జనగాని పెద్ద సాంబయ్య, ఓదెలు, ఆకునూరి సాంబయ్య, కుత్బొద్దీన్, బొల్లబోయిన సాంబయ్య పాల్గొన్నారు.

రమాబాయి జయంతి



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రమాబాయిఅంబేడ్కర్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగర విజయ్‌ప్రకాశ్ రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రమాబాయిఅంబేడ్కర్ సమాజానికి చేసిన త్యాగాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు గౌరవ సలహాదారుడు సురేశ్, యువజన సంఘం మాజీ అధ్యక్షుడు రాజు, సభ్యులు వికాస్, సాయితిలక్ పాల్గొన్నారు.

10 నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

శాయంపేట : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి సాయికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో, కళాశాల విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు తగు సూచనలు చేస్తూ మాత్రలు తినిపించాలని సూచించారు.

వేతనాలు విడుదల చేయాలి

నడికూడ : జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు వారు వాపోయారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని వారు కోరారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల, వేలేరు సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లోని అన్ని ఫీడర్‌లల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ కూమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, ఉప్పల్ విద్యుత్ సెక్షన్ల పరిధిలోని కమలాపూర్, శనిగరం, ఉప్పల్, మర్రిపల్లిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వంశీకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్‌లో భాగంగా కమలాపూర్, వంగపల్లి, గూడూరు, దేశరాజుపల్లి, శనిగరం, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఉప్పల్, కన్నూరు, భీంపల్లి, గుండేడు, మర్రిపల్లిగూడెం, మర్రిపల్లి, జూజునూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి : ప్రస్తుతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశం అనుకూలంగా లేదని సత్య సాయి కాలనీ–5 వాసులు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని కాలనీ ప్రధాన కార్యదర్శి టీఆర్‌కే రెడ్డి కోరారు.

కొత్త బ్రేకర్‌చార్జ్ ఏర్పాటు

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్‌లో శుక్రవారం కొత్తబ్రేకర్ చార్జ్ ఏర్పాటు చేశారు. ఈ చార్జ్‌తో భీమారం, ఎర్రగట్టు గుట్ట ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం నివారించవచ్చని డీఈఈ సామ్యా నాయక్ తెలిపారు. ఏడీఈ ఏఈ ఉన్నారు.

మంచి అలవాట్లే ఉన్నత దశకు చేరుస్తాయి



కాజీపేట : విద్యార్థులు మంచి అలవాట్లే వారి గోల్‌ను చేరుకునేలా చేయడమే కాకుండా ఉన్నత దశకు చేరుస్తాయని ఓరగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. స్థానిక సేయింట్ ఆన్స్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల సీనియర్ టీచర్ ఫాతిమా థామస్ అధ్యక్షత వహించిన సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హన్మకొండ కార్యదర్శి తేరాల యుగందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ప్రజలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గల పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈనెల 5నుంచి ప్రారంభమైన వేడుకలను వేద పండితులు హోమాలు, యాగాలు నిర్వహించి శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాగా ముందుగా గవ్యాంత పూజలు, గర్తన్యాసం, రత్నన్యాసం, పీఠపూజలు, యంత్రస్థాపన, విగ్రహస్థాపన, ప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి, నేత్రోన్మీలనం, కుంబాభిషేకం, దృష్టికుంభం ,కూష్మాండ బలి, నీరాజన మంత్రపుష్పం, మహాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వర్తించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మూడో రోజు కొనసాగిన ఆందోళన



ఉప్పల్‌లో ధర్నా, రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేవరకూ ఉద్యమిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. మండల సాధన సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులతో కలిసి శుక్రవారం మూడో రోజు ఆందోళన కొనసాగించారు. ఉప్పల్‌లోని కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. హుజూరాబాద్ తాలుకాలో కమలాపూర్ కంటే ముందే ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త మండలాల ఏర్పాటు సమయంలోనే ఉప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేయాల్సినప్పటికీ చేయలేదన్నారు. మండల కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు, వనరులు, వసతులున్న ఉప్పల్‌ను వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, ప్రస్తుతం కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా తమతోపాటు ఆందోళనలో పాల్గొనాలన్నారు. సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్ స్థానిక సీఐ హరికృష్ణ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. మండల సాధన సమితి, అఖిలపక్ష నాయకులు నవీన్‌కుమార్, సంపత్‌రావు, శ్రీనివాస్, రాణాప్రతాప్, రాంచందర్, రాజమౌళి, రాజ్‌కుమార్, ఉపేందర్, భాస్కర్, అద్భుతరావు, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనాలేవి

- డీఈఓను ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



డీఈఓతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరకాల : శిథిలమైన భవనాలను కూల్చివేసిన ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఆరోపించారు. శుక్రవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి వచ్చిన డీఈఓను ఎస్ఎఫ్ఐ నాయకులు కలిశారు. పరకాలలోని ప్రభుత్వ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అరకొర గదులతో పాటు తాగునీరు, మూత్రశాలలు సరిగా లేకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డీఈఓను కోరారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న మిషన్ భగీరథ సీఈ సురేశ్‌కుమార్

ఆత్మకూరు : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ సీఈ సురేశ్ కుమార్, ఎస్ఈ మల్లేశ్, డీఈఈ మధు కుమార్ సూచించారు. శుక్రవారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో మంచినీటి బావులు, వాటర్ ట్యాంక్‌లు, చేతిపంపులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనిచేయని చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడి నివారణపై నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్, పంచాయతీ కార్యదర్శులు బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఇందిర

ఆత్మకూరు : సఖి సేవలను వినియోగించుకోవాలని సర్వోదయ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళలకు సఖి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఖి సేవలు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణ కోసం సఖి కేంద్రం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, సేవల కోసం 181 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సఖి అందిస్తున్న సేవలపై గ్రామల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ భారతి, భాగ్యలక్ష్మి, రమ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన

- మాల జేఏసీ చైర్మన్ లక్ష్మీనారాయణ



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాల జేఏసీ నాయకులు

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన అని మాల జేఏసీ చైర్మన్ పసుల లక్ష్మీనారాయణ విమర్శించారు. మండలంలోని నీరుకుళ్లలో శుక్రవారం మాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను మోసం చేసేందుకు పావులు కదుపుతుందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతీ మాల బిడ్డ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 14న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ మండల ఉపాధ్యక్షుడు కిన్నెర రాజు, నాయకులు శంకర్, రామస్వామి, సారయ్య విద్యాసాగర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.